క్లుప్తంగా

విద్యుత్ వృథా



శ్రీరాముల పేటలో వెలుగుతున్న ఎల్ఈడీ బల్బు

పత్తికొండ రూరల్: పట్టణంలోని పలు వీధుల్లో బల్బులు పగలు కూడా వెలుగుతున్నాయి. కొన్ని కాలనీల్లో వీధిలైట్లు లేక ప్రజలు చీకట్లో మగ్గుతుండగా మరికొన్ని వీధులు విద్యుత్‌ను వృథా చేస్తున్నారు. దీంతో అదనపు విద్యుత్ భారం గ్రామ పంచాయతీపై పడుతోంది. పంచాయతీ అధికారులు స్పందించి వీధిలైట్లు సమయానుకూలంగా వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా లక్ష్మమ్మవ్వ వార్షికోత్సవం



పూజలందుకున్న అమ్మవారు

నందవరం: మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో మహాయోగి లక్ష్మమ్మవ్వ వార్షికోత్సవం శనివారం ఆలయ ధర్మకర్త రంగశెట్టి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పూజారులు దానప్ప, కోటికల్ పరమేశ్ ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం దీపోత్సవం, పల్లకీ సేవ నిర్వహించారు.

జోరుగా నాటుసారా



పత్తికొండలో రోడ్డుపై పడుకున్న మందుబాబు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని తండాల్లో నాటుసారా వ్యాపారం జోరుగా సాగుతోంది. దీంతో మందుబాబులు రోజంతా కష్టపడి సంపాదించిన సొమ్మును తాగుడుకే తగలేస్తున్నారు. తాగిన మైకంలో ఎక్కడపడితే అక్కడ పడిపోయి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. నాటు సారా నియంత్రణలో సెబ్, పోలీసు అధికారుల ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

కబడ్డీ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్ఐ

కృష్ణగిరి: మండల పరిధిలోని చుంచు ఎర్రగుడి గ్రామంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, సంగాల గిడ్డయ్య తదితరులతో కలిసి ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. పోటీల్లో 30 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల నగదు బహుమతులు అందిస్తామన్నారు. కాగా ఆదివారం నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పాలపళ్ల ఎద్దుల బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి ప్రారంభించనున్నట్లు తెలిపారు.

నిరుపయోగంగా జనరేటర్



వృథాగా ఉన్న జనరేటర్

ఆలూరు రూరల్: మండల రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జనరేటర్ నిరుపయోగంగా ఉంది. కార్యాలయాలలో 5 కేవీ సామర్థ్యం కలిగిన జనరేటర్ 2010లో ఏర్పాటు చేశారు. దీనికి ఎలాంటి కనెక్షన్ ఇవ్వకపోవడంతో 12 ఏళ్లుగా నిరుపయోగంగా ఉంది. అధికారులు పట్టించుకోకపోవడంతో జనరేటర్ ఉత్సవ విగ్రహంలా దర్శనమిస్తోందనే ఆరోపణలున్నాయి.

గడ్డివామి దగ్ధం

ఆస్పరి: మండల కేంద్రానికి చెందిన రైతు రంగనాయకులు గడ్డివామి అగ్నిప్రమాదంలో కాలి బూడిదైంది. బాధితుడు తెలిపిన వివరాలు.. గడ్డివామి నుంచి మంటల చెలరేగడంతో గ్రామస్తులు గమనించి ఆర్పే ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది. దాదాపు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీ

హొళగుంద: మండల కేంద్రంలోని రైస్ మిల్లుల్లో శుక్రవారం అర్ధరాత్రి విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. రేషన్ బియ్యం ఇక్కడి నుంచి కర్ణాటకకు అక్రమంగా తరలుతుందనే సమాచారంతో తనిఖీలు చేశారు. మిల్లుల్లో ఉన్న స్టాక్ వివరాలు, రికార్డులు పరిశీలించారు. అయితే ఎలాంటి అక్రమ నిల్వలు లభ్యం కాలేదని సమాచారం.

శివయ్యా.. కరుణించవయ్యా

- భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి
- శివనామ స్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు
- భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు
- వేడుకగా శివపార్వతుల కల్యాణం

మహా శివరాత్రి వేడుకలను శనివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఎటు చూసినా ఈశ్వర నాదం ప్రతిధ్వనించింది. ఆలయాలన్నీ శివనామస్మరణతో మారుమ్రోగాయి. చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ శివయ్యను తలచుకుని తన్మయత్వం పొందారు. ఉదయాన్నే తలస్నానాలాచరించి ఆలయాలకు చేరుకుని కాయకర్పూరాలతో పూజలు నిర్వహించుకున్నారు. మహిళలు ఉపవాస దీక్ష చేబూని శివుడికి ఇష్టమైన పాయసం, గుగ్గిళ్లు, బెల్లం పానకం తయారు చేసి దైవేద్యంగా సమర్పించారు. రోజంతా శివుడి జన్మవృత్తాంతం, శివయ్య లీలల సినిమాలు వీక్షిస్తూ ఆధ్యాత్మిక వాతావరణంలో గడిపారు.

– సాక్షి నెట్‌వర్క్



వెల్దుర్తి సమీపంలోని బ్రహ్మగుండంలో బ్రహ్మేశ్వరుని దర్శనార్థం క్యూ కట్టిన భక్తులు



స్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే శ్రీదేవి

ఎమ్మిగనూరులో..



వీవర్స్ కాలనీ ఆలయ ఆవరణలో భక్తుల సందడి

ఎమ్మిగనూ పట్టణంలోని తేరుబజారు మార్కెండేయ, కోటా ఈశ్వర, వీవర్స్ కాలనీ సీతారామాంజనేయస్వామి, మాత్రాల తిమ్మప్ప, రెవెన్యూ కార్యాలయంలోని దత్తసాయి తదితర ఆలయాల్లో స్వామి వార్లకు భక్తులు పూజలు నిర్వహించారు. మార్కెండేయ ఆలయ ఆవరణలో దీపోత్సవం నిర్వహించారు. రుద్రాభిషేకాలు, లింగార్చన, ప్రత్యేక హోమాలతో ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. అలాగే మండలంలోని గుడేకల్ భ్రమరాంబ మల్లికార్జునస్వామి, పార్లపల్లి, పెసలదిన్నె మోక్షలింగేశ్వరస్వామిలతో పాటు అన్ని గ్రామాల్లో శివరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు.

గోనెగండ్ల మండలంలో..



శివుడి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న గ్రామస్తులు

మండల కేంద్రంతోపాటు గంజహళ్లి, పుట్టపాశం, అలువాల, గాజులదిన్నె, వీరంపల్లి, ఎర్రబాడు, అగ్రహారం, బైలుప్పల, హెచ్ కైరవాడి, వేముగోడు తదితర గ్రామాల్లో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. గోనెగండ్ల ఈశ్వర ఆలయంలో వీరశైవమఠం పీఠాధిపతి శివయ్య స్వామి, నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు రామారావు ఆధ్వర్యంలో స్వామి వార్లకు పూజలు నిర్వహించారు. హెచ్ కైరవాడిలో సాయంత్రం శివుని చిత్రపటంతో గ్రామస్తులు గ్రామోత్సవం నిర్వహించారు.

వెల్దుర్తిలో..

మండల కేంద్ర సమీపంలోని బ్రహ్మగుండం క్షేత్రంలో ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ టి.హనుమంతరావ్, చైర్మన్ బొమ్మన పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉదయం నుంచే ఆలయానికి భక్తులు పోటెత్తారు. కామేశ్వరీదేవి సమేత బ్రహ్మేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి తదితరులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు ఎమ్మెల్యే శ్రీదేవి అల్పాహారం ఏర్పాటు చేశారు. కామేశ్వరీదేవి అమ్మవారికి బంగారు తాళి బొట్టు చేయించి అర్చకులకు అందించారు. అర్ధరాత్రి తర్వాత గంగా, గౌరీ మహేశ్వరుల కల్యాణం కమనీయంగా సాగింది. ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళల సౌకర్యార్థం వెల్దుర్తి నుంచి బ్రహ్మగుండం వరకు రెండు ప్రైవేట్ బస్సులు ఏర్పాటు చేశారు. పారిశ్రామికవేత్త గోనెపట్టల భాస్కర్ శెట్టి 15 ఆటోలను ఉచితంగా ఏర్పాటు చేశారు. వడ్డెర యూత్ ఆధ్వర్యంలో తాగునీటి వసతి కల్పించారు. ఆర్యవైశ్య అన్నసత్రం నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

మద్దికెర మండలంలో..

మండల కేంద్రంతో పాటు పెరవలి, ఎం.అగ్రహారం, హంప, బసినేపల్లి తదితర గ్రామాల్లో మహాశివరాత్రిని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మద్దికెరలోని విరుపాక్షుడి ఆలయం, కొండమ్మ బావి శివాలయం, నగిరేశ్వర ఆలయంలో పార్వతీపరమేశ్వర ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తుగ్గలి మండలంలో..

తుగ్గలి, రాతన, జొన్నగిరి, జీ.ఎర్రగుడి, పగిడిరాయి, చెన్నంపల్లి, పెండేకల్లు, మారెల్ల, ముక్కెల్ల, ఉప్పర్లపల్లి, శభాష్ పురం, రాంపల్లి, బొందిమడుగుల, రామకొండ, ఎద్దులదొడ్డి, కడమకుంట్ల గ్రామాల్లో శనివారం శివరాత్రి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. భక్తులు శివాలయాలకు వెళ్లి స్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. భక్తులు ఉపవాసాలతో జాగరణ చేశారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గిరిగెట్లలో రాత్రి నందికోల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



రామలింగేశ్వరుడికి అభిషేకం చేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

నందవరం మండలంలో..

మండంలో మహా శివరాత్రి పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. గురజాల రామలింగేశ్వరుడి క్షేత్రానికి రాష్ట్ర నలుమూలల నుంచే గాక కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలాచరించి రామలింగేశ్వరుడిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ దినేష్ ఆధ్వర్యంలో పురోహితులు హంపేష్ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి నటరాజ కళాక్షేత్రం బృందం కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు గోనెగండ్ల మండలం చిన్నమర్రివీడు గ్రామానికి చెందిన బి. గోకారి, కురవ మల్లయ్య అన్నదానం ఏర్పాటు చేశారు. ఆదివారం స్వామి వారి రథోత్సవం ఉంటుంది.



తుంగభద్ర నది వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



గురజాలలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఆస్పరి మండలంలో..



రామతీర్థం వద్ద స్వామి వారి ప్రభోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

మండలంలోని శివాలయాల్లో పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆస్పరిలోని మూల ఈశ్వర స్వామి, తిమ్మగురుడు పక్కీరప్ప తాత, రామతీర్థంలోని రామలింగేశ్వరస్వామి, బిణిగేరిలో శ్రీగిరి పంచలింగేశ్వర స్వామి, కైరుప్పలలోని వీరభద్రస్వామి, మహాలింగప్ప ఆలయాల్లో గంగ, ఆకుపూజ, పంచామృతాభిషేకం, మహా మంగళ హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. బిణిగేరి సమీపంలోని కొండల్లో వెలసిన శ్రీగిరి పంచలింగేశ్వర స్వామి ఆలయంలో హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామతీర్థంలోని రామలింగేశ్వర స్వామి ప్రభోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

కృష్ణగిరి మండలంలో..

మండల కేంద్రంతో పాటు చుంచు ఎర్రగుడి, కంబాలపాడు, కటారుకొండ, లక్కసాగరం తదితర గ్రామాల్లో మహా శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. చుంచు ఎర్రగుడి గ్రామంలోని రామప్ప ఆలయానికి భక్తులు అధికసంఖ్యలో వచ్చి రామలింగేశ్వరున్ని దర్శించుకున్నారు. భక్తులకు పత్తికొండకు చెందిన పోచమిరెడ్డి సేవాదళ్ నిర్వాహకుడు పోచమిరెడ్డి మురళీధర్‌రెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు. లక్కసాగరంలో రాత్రి నందికోళ సేవ నిర్వహించారు.

ఆలూరు మండలంలో..



ఆలూరు శివాలయం వద్ద స్వామి దర్శనానికి బారులుదీరిన భక్తులు

మహాశివరాత్రి పర్వదినం మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఆలూరు కోటవీధిలోని భీమలింగేశ్వర స్వామి, బెళ్లగుండా ఆంజనేయస్వామి ఆలయాల్లో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తిని ఎల్లార్తి రోడ్డు సమపంలో ఉన్న మర్రితా మఠం నుంచి అంబేడ్కర్ సర్కిల్‌లోని ఎదురు బసవన్న గుడి వరకు ఉంచి ప్రభోత్సవం నిర్వహించారు. కురుకుంద, హుళేబీడు, మొలగవెళ్లి, అరికెర, ముద్దనగేరి, కమ్మరచేడు గ్రామాల్లోనూ మహాశిరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి.

పత్తికొండ మండలంలో..



పత్తికొండలో ర్యాలీ ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, బ్రహ్మకుమారి లక్ష్మి

పత్తికొండ పట్టణంలో ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నిర్వాహకులు లక్ష్మి ఆధ్వర్యంలో మహాశివరాత్రి పురస్కరించుకుని త్రిమూర్తి శివజయంతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో బ్రహ్మకుమారి లక్ష్మి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, సీనియర్ వైద్యుడు సుబ్రమణ్యం జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీలో చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. రెడ్డిబావివీధిలోని శివాలయం, సాయిమందిరం ప్రాంగణంలోని మరకతేశ్వరాలయం, బైపాస్‌రోడ్డులోని పురాతన శివాలయం, ఆదోనిరోడ్డులోని ఉరుకుంద ఈరన్నస్వామి, తేరుబజారులోని మార్కండేయస్వామి, శివాలయం, రాజులమందగిరి గ్రామ కొండపై ఉన్న రామలింగేశ్వరస్వామి తదితర ఆలయాల్లో భక్తులు మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు.

హొళగుంద మండలంలో

హొళగుంద సిద్ధేశ్వరస్వామి, సిద్ధనగౌడ్ తాతా, దక్షిణమూర్తి, భోగేశ్వరస్వామి, వీరభద్రేశ్వరస్వామి, దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామి, శ్రీరామ్‌నగర్ క్యాంపులోని వరలింగస్వామి(ఈశ్వరుడు) తదితర ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దేవ మ్మ ఆలయం వద్ద చిన్నారులు దేవీ రథోత్సవాన్ని నిర్వహించారు.

తిమ్మగురుడు ఉత్సవాలు ప్రారంభం

తుగ్గలి: మండల పరిధిలోని మీటే తండా సమీపంలోని బోడబండ పుణ్యక్షేత్రంలో వెలసిన తిమ్మ గురుడు, పక్కీరప్పస్వాముల తిరునాల ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి భజనలతో రాత్రంతా జాగరణ చేశారు. తిరునాల సందర్భంగా అప్పా సోదరులు అన్నదానం చేశారు. ఆలయ ప్రాంగణంలో మిఠాయి, జాయింట్‌వీల్, బొమ్మలు, గాజుల అంగళ్లు, హోటళ్లు తదితర దుకాణాలు వెలిశాయి. స్వాముల ఉత్సవ విగ్రహాలను సాయంత్రం మేళ తాళాలతో ఉప్పర్లపల్లి నుంచి బోడబండకు చేర్చారు. ఆదివారం సాయంత్రం రథోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఆలయ ధర్మకర్తలు సుదర్శనరెడ్డి, అప్పా వేణు, నిర్వాహకులు ఉప్పర్లపల్లి సర్పంచ్ ప్రభాకరరెడ్డి, కృష్ణయ్యాచారి, అప్పా చంద్రశేఖర్, సుగుణాకర్, ఎంపీటీసీ సభ్యుడు రామదాసునాయక్, మీటీతండా సర్పంచ్ బాలమ్మ, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ మండల కన్వీనర్ భీమానాయక్ పాల్గొన్నారు.

రైతుకు యంత్ర సాయం

- సీహెచ్‌సీ గ్రూపులకు రాయితీపై వ్యవసాయ యంత్రాలు
- సంఘాల ద్వారా అద్దెకు తీసుకునే అవకాశం



గూళ్యం గ్రామ సీహెచ్‌సీ గ్రూపునకు ట్రాక్టర్ అందిస్తున్న మంత్రి గుమ్మనూరు(ఫైల్)

ఆలూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయానికి పెద్దపీట వేసింది. రైతు భరోసా నగదు, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం, పెట్టుబడి సాయం వంటి సంక్షేమ పథకాలు అమలు చేసింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా కస్టమర్ హైరింగ్ సెంటర్లు (సీహెచ్‌సీ) ఏర్పాటు చేసి వ్యవసాయానికి అవసరమైన యంత్రాలను సబ్సిడీపై అందజేస్తోంది. రైతులు వీటిని అద్దెకు తీసుకునే సౌకర్యం కూడా కల్పించింది. దీంతో ప్రైవేటు వ్యక్తుల వద్ద ఎక్కువ ధరకు పరికరాలు అద్దెకు తీసుకునే ఇబ్బంది తప్పుతుంది. ఇప్పటి వరకు సబ్ డివిజన్‌లో 70 సీహెచ్‌సీలకు రూ.1.91 కోట్ల విలువ చేసే యంత్రాలు అందించారు.

సబ్ డివిజన్‌లో 74 గ్రూపులు ఏర్పాటు

ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లోని 5 మండలాల్లో 76 సీహెచ్‌సీలు ఉండగా..74 గ్రూపులు ఏర్పాటు చేశారు. ప్రతి గ్రూపులో కన్వీనర్‌తో కలుపుకొని ఐదు నుంచి ఎనిమిది మంది సభ్యులు ఉన్నారు. ఆయా గ్రూపులకు సంబంధించి బ్యాంకు ఖాతా ప్రారంభించారు. లావాదేవీలను కన్వీనర్, కో–కన్వీనర్ చూస్తున్నారు. ప్రతి గ్రూపునకు దాదాపు రూ.15 లక్షల వరకు విలువ చేసే యంత్ర పరికరాలు కొనుగోలు చేసుకోవచ్చు. యంత్రాల పంపిణీ, కమిటీ నిర్వహణ ఆయా గ్రామ ఆర్బీకేల పరిధిలో ఉంటాయి.

40 శాతం సబ్సిడీ

కస్టమర్ హైరింగ్ సెంటర్ గ్రూపులకు ప్రభుత్వం 40 శాతం సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలను అందజేస్తోంది. ట్రాక్టర్, రోటావేటర్, పవర్ స్ప్రేయర్లు, దమ్ములు, దుక్కి, కోత మిషన్లు, ఇలా రైతులకు అవసరమైనవి అందిస్తోంది. వీటి ధరను గ్రూపు సభ్యులు 10 శాతం, సహకార బ్యాంకు ద్వారా 50 శాతం, ప్రభుత్వం 40 శాతం భరిస్తోంది. అధికారులు పరిశీలన చేసి యంత్ర పరికరాల నిర్వహణపై సంతృప్తి చెందాల్సి ఉంటుంది. బ్యాంకు ద్వారా తీసుకున్న లోను వాయిదాల పద్ధతిలో చెల్లిస్తున్నారు.

అద్దెకు ఇచ్చుకునే అవకాశం

సబ్సిడీపై ప్రభుత్వం అందించిన యంత్రాలు గ్రూపు సభ్యులు వాడుకోవడంతో పాటు స్థానిక రైతులకు అద్దెకు ఇచ్చుకునే అవకాశం కల్పించారు. అద్దె ద్వారా వచ్చే నగదుతో బ్యాంకులో తీసుకున్న లోను చెల్లించుకోవచ్చు. మిగిలిన మొత్తం పరికరాల మరమ్మతులకు వినియోగించునే అవకాశం ఉంది. దీనికి సంబంధించి అన్ని విషయాలను గ్రూపు సభ్యులు సమావేశమై తీర్మానం చేసి ప్రతిపాదించాల్సి ఉంటుంది.

పరికరాలు కొనుగోలు చేశాం



మా గ్రామంలో వైఎస్సార్ రైతు మిత్ర సంఘం పేరిట సీహెచ్‌సీ గ్రూపు ఏర్పాటు చేశాం. రూ.7,69,669 విలువ చేసే ట్రాక్టర్, వ్యవసాయ యంత్రాలను కొనుగోలు చేశాం. ఇటీవల అధికారులు యంత్రాలు పరిశీలించి పంపిణీ చేశారు. వాటిని పంటల సాగులో ఉపయోగించుకుంటున్నాం. అవసరమైన రైతులకు అద్దెకు ఇస్తున్నాం.

– రాఘవేంద్ర, సీహెచ్‌సీ గ్రూపు సభ్యుడు, ఆలూరు

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



గ్రూపుల సభ్యులకు సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నాం. అర్హత ఉన్న అన్ని గ్రూపులకు యంత్రాలు ఇస్తాం. సబ్సిడీ యంత్రాలు ఉపయోగించుకుని వ్యవసాయ ఖర్చులు తగ్గించుకోవచ్చు.

– సునీత, ఏడీఏ, ఆలూరు